
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 12 నవంబర్ 2025
5
ఏలూరు



రైతులు రీసర్వేను వినియోగించుకోవాలి

జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు షేక్ మహ్మద్ అన్సారీ



మాట్లాడుతున్న అధికారి మహ్మద్ అన్సారీ

ఆగిరిపల్లి : రైతులందరూ రీ-సర్వే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు షేక్ మహ్మద్ అన్సారీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణవరం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు రీ సర్వే విధి విధానాలు, ప్రయోజనాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులు వ్యక్తపరిచిన పలు సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రామకృష్ణ బాబు, కృష్ణవరం గ్రామ సర్వేయర్ వినోద్ కుమార్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

సర్పంచి, ఎంపిటిసిలకు.. జీతాల్లేవ్..!

స్థానిక ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం తీవ్ర వివక్ష
26 నెలలుగా గౌరవ వేతనం ఇవ్వని దుస్థితి
ఒక్కో సర్పంచి, ఎంపిటిసికి దాదాపు రూ.లక్ష వరకూ బకాయి
సర్పంచి, ఎంపిటిసిలకు నెల జీతం కేవలం రూ.3 వేలే
ఎంఎల్ఎలకు మాత్రం ఒకటో తేదీనే రూ.లక్షల్లో జీతాలు జమ
వచ్చే మార్చి నాటికి ముగియనున్న సర్పంచుల పదవీకాలం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచి, ఎంపిటిసి, జెడ్‌పిటిసిల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేసే ప్రజాప్రతినిధులకు ఇచ్చే కొద్దిపాటి గౌరవ వేతనం సైతం ఏళ్లతరబడి పెండింగ్‌లో పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో ఐదు నెలల్లో సర్పంచుల పదవీకాలం ముగియనుంది. వారికి ఇవ్వాల్సిన వేతన బకాయిల గురించి మాత్రం ప్రభుత్వం నోరు మెదపడం లేదు. గ్రామాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులు, ప్రజాప్రతినిధుల జీతాలు విషయంలోనూ ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది. ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 409 పంచాయతీలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో 956 మంది సర్పంచులు ఉన్నారు. 2020 మార్చిలో వీరంతా సర్పంచులుగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ దాదాపు 55 నెలల కాలం గడిచిపోయింది. మరో ఐదు నెలల్లో సర్పంచుల పదవీకాలం ముగియనుంది. 2026 జనవరిలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ఇటీవల ఎన్నికల కమీషన్ ప్రభుత్వానికి లేఖ సైతం రాసింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 876 మంది ఎంపిటిసిలు, 48 మంది జెడ్‌పిటిసిలు ఉన్నారు. వీరి పదవీకాలం 2026 సెప్టెంబర్‌తో ముగియనుంది. సర్పంచి, ఎంపిటిసిలకు 26 నెలలుగా, జెడ్‌పిటిసిలకు 36 నెలలుగా జీతాలు అందని పరిస్థితి ఉంది. ఒక్కో సర్పంచి, ఎంపిటిసికి దాదాపు రూ.లక్ష వరకూ జీతాల బకాయి ఉంది. జెడ్‌పిటిసిలకైతే రూ.రెండు లక్షలకుపైగా జీతాల బకాయిలు పెండింగ్ ఉన్న పరిస్థితి. క్షేత్రస్థాయిలో ప్రజల కోసం పని చేసేది సర్పంచులు, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు మాత్రమే. నిరంతరం ప్రజలతో మమేకమై స్థానిక ప్రజాప్రతినిధులంతా పని చేస్తుంటారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా జనం తొలుత కలిసేది వీరినే. గ్రామాల్లో జనాల సమస్యలను ఎంఎల్ఎ, ఎంపీ దృష్టికి తీసుకెళ్లేది సర్పంచి, ఎంపిటిసి, జెడ్‌పిటిసిలే. సర్పంచి, ఎంపిటిసిలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం మాత్రం రూ.మూడు వేలు, జెడ్‌పిటిసిలకు రూ.ఆరు వేలుగా ఉంది. 2023 సెప్టెంబర్ నుంచి సర్పంచి, ఎంపిటిసిలకు జీతాలు అనేవి ప్రభుత్వం ఇవ్వలేదు. దాదాపు 26 నెలలుగా వీరికి జీతాలు ఇవ్వడం లేదు. జెడ్‌పిటిసిలకైతే 2022 సెప్టెంబర్ నుంచి ఇవ్వని పరిస్థితి ఉంది. సర్పంచి, ఎంపిటిసిలకు సకాలంలో గౌరవ వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సర్పంచి, ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలకు జీతాలు ఇవ్వని ప్రభుత్వం ఎంఎల్ఎలకు మాత్రం ప్రతినెలా మొదటి తేదీనే రూ.లక్షల్లో జీతాలు జమ చేస్తోంది. ఎంఎల్ఎలకు జీతాలు సకాలంలో ఇస్తున్నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు ఇవ్వరనే ప్రశ్న తలెత్తుతోంది. ఇటీవల కాలంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ సైతం జిల్లా పరిషత్ సమావేశాల్లో మంత్రుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లింది. అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

నిధుల పరిస్థితీ అంతే..

పంచాయతీలకు ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల విషయంలోనూ గత ప్రభుత్వంతోపాటు, ఈ ప్రభుత్వం సైతం సకాలంలో విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. సర్పంచుల పదవీకాలం మరో ఐదు నెలల్లో ముగియనుంది. గ్రామాల్లో సీసీ రోడ్లతోపాటు చేసిన అనేక పనులకు సంబంధించిన బిల్లులు రాని పరిస్థితి ఉంది. ఒక్కో పంచాయతీ పరిధిలో తక్కువగా లెక్కించినా రూ.15 లక్షల వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఇలాగైతే పనులు ఏవిధంగా చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గ్రామాల అభివృద్ధే.. దేశాభివృద్ధి అంటూ నినాదాలు ఇవ్వడం తప్ప నిధులు, జీతాల విషయంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది.

జీతాలివ్వరు.. పథకాలు మాత్రం కట్..!

సర్పంచి, ఎంపిటిసిలకు సిఎంఎఫ్ఎస్ ద్వారా జీతాలను జమ చేసే విధానం తెచ్చారు. సిఎంఎఫ్ఎస్ ద్వారా జీతాలు ఇస్తున్న కారణంగా సర్పంచి, ఎంపిటిసి, జెడ్‌పిటిసిలకు రైతుభరోసా, తల్లికి వందనం వంటి పథకాలు సైతం నిలుపుదల చేసినట్లు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు గగ్గోలు పెడుతున్నారు. నెలకు రూ.మూడు వేలు జీతం ఇస్తే ప్రభుత్వ పథకాలు ఆపేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన సమాధానం రాని పరిస్థితి ఉంది.

ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి

జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ : అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



సామూహిక నృత్య ప్రదర్శన





సామూహిక నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

యువజనోత్సవాల్లో పోటీపడే యువత జాతీయస్థాయి వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక గవరవరంలోని సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో సెట్‌వెల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. తొలుత మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు కూడా అవసరమన్నారు. సాంస్కృతిక రంగాలను ఎంచుకున్న అనేక మంది ఉన్నత స్థానాలకు ఎదిగి జాతీయస్థాయిలో గుర్తింపు పొందారని తెలిపారు. పోటీల్లో గెలుపోటములు ముఖ్యం కాదని, పాల్గొన్న ప్రతిఒక్కరూ ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు. సెట్‌వెల్ సిఇఒ కెఎన్.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఈ యువజనోత్సవాల్లో గతంలో 18 అంశాల్లో పోటీలు జరిగాయని, ఇప్పుడు ఏడు అంశాల్లో మాత్రమే జాతీయస్థాయి వరకు పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ జిల్లాస్థాయిలో యువతను ఉత్సాహపర్చడం కోసం కొన్ని అంశాలను చేర్చామన్నారు. చదువుతోపాటు ఇతర అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి యువజనోత్సవాలను నిర్వహిస్తున్నాయన్నారు. అనంతరం భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యం సోలో, వెస్ట్రన్ డ్యాన్స్, జానపద నృత్యం గ్రూపు, జానపద గీతం గ్రూప్ వంటి అంశాల్లో యువత తమ ప్రతిభతో ఉర్రూతలూగించారు. ముఖ్యంగా ఏలూరు సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యం, ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన జాతర అంశంతో కూడిన నృత్యం అలరించింది. వీటితోపాటు కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, ఉపన్యాసం, సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన వంటి వాటిలో విద్యార్థులు పోటీపడి తమ ప్రతిభ చాటారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికవుతారని సిఇఒ ప్రభాకర్‌రావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ మెర్సీ, బిసి వెల్ఫేర్ జిల్లా అధికారి నాగరాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఎంఎస్ఎంఇ పార్కు శంకుస్థాపనలో ఎంఎల్ఎ బడేటి



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఔత్సాహికులైన యువ పారిశ్రామిక వేత్తలను అన్నివిధాలా ప్రోత్సహిస్తూ, పరిశ్రమల స్థాపనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎదురైన సవాళ్లను అధిగమించి సమున్నత లక్ష్యం దిశగా కూటమి ప్రభుత్వం కీలకమైన అడుగు వేసిందని ఆయన వెల్లడించారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియం వద్ద ఎపి ఎమ్ఎస్ఎమ్ఇ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0లో భాగంగా 2.2 ఎకరాల్లో సుమారు రూ.14 కోట్ల నిధులతో ఏర్పాటు చేయనున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్-పారిశ్రామిక వాడ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ మంగళవారం శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్ఎస్ఎమ్ఇ పార్కులను ఏర్పాటు చేసి పరిశ్రమలను ప్రోత్సహించాలన్న కూటమి ప్రభుత్వం నిర్ణయం మేరకు హేలాపురిలో కూడా దీని ఏర్పాటుకు బీజం పడిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లాలో ఎమ్ఎస్ఎమ్ఇకి శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం ఎంఎల్ఎ మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులు స్వశక్తితో స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన అవకాశాలను కూటమి ప్రభుత్వం పుష్కలంగా కల్పిస్తోందని చెప్పారు. వాటన్నింటినీ ఔత్సాహికులైన పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా హేలాపురి నగరంలోని నడిబొడ్డులో పార్క్ ఏర్పాటుకు అనువైన స్థలం లభించడం అదృష్టమన్నారు. ఇక్కడ చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి. సాల్మన్‌రాజు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, తహశీల్దార్ గాయత్రీ దేవి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

యువకులకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట : మంత్రి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్ఎ, ఛైర్‌పర్సన్ దంపతులు

చింతలపూడి : యువకులకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఏలూరు ఇన్‌ఛార్జి మంత్రి, పౌరసరఫరా శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. మండలంలోని ఎఎంసి ఛైర్మన్ చీదరాల దుర్గా పార్వతి ప్రమాణ స్వీకారంలో ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొల్లిశెట్టి శ్రీనివాస్, పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో నాయకత్వం పెరగటానికి యువకులకు అవకాశం ఇచ్చారన్నారు. పదవి అంటే అలంకరణ కాదని, బాధ్యత అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారని, అందులో భాగంగా యువకులకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. అందరూ కష్టపడితేనే ఈ స్థాయికి వచ్చారని, పార్టీ కోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. గత సంవత్సరం డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సహకారంతో నియోజకవర్గానికి పంచాయతీరాజ్ తరపున రూ.30 కోట్లు ఇచ్చామని, ఇప్పుడు ఈనెలాఖరులోపు మరలా నిధులు విడుదల చేస్తామని, ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర పరిస్థితి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, 13 లక్షల 70 కోట్లు రాష్ట్రం అప్పుల్లో ఉందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన అందరికీ జీతాలు ఇస్తున్నామని, ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా జీతాలు ఆపడం లేదన్నారు. చింతలపూడి ఎఎంసి అభివృద్ధికి, జిల్లాలో మొదటి స్థానంలో నిలపటానికి, ఎటువంటి సహకారమైనా జిల్లా వాసిగా కచ్చితంగా చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి ఎఎంసి మార్కెట్‌ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్నారు. చింతలపూడి ఎఎంసి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకుని తమ వద్దకు తీసుకువస్తే వాటిని అమలుపరిచే విధంగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో చింతలపూడి ఎఎంసి ఛైర్మన్ జనసేనకి రావటం అభినందనీయమన్నారు. ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కష్టపడిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వం గుర్తించి పదవులు ఇచ్చిందన్నారు. పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముందుకు వెళుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే రైతాంగం అంతా సస్యశ్యామలమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపి ఆర్‌టిసి ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, మాజీ ఎంఎల్ఎ గంటా మురళీ, శేషు, మాజీ ఎఎంసి ఛైర్మన్ ముత్తారెడ్డి, జనసేన ఘంటసాల వెంకటలక్ష్మి, నియోజకవర్గ కన్వీనర్ మేక ఈశ్వరయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పంటలకు మంచి ధరే ఫుడ్ ప్రాసెసింగ్ లక్ష్యం

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి
మొర్సిపూడిలో రమణసింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్ పనులకు శంకుస్థాపన



సభలో మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రైతుల పంటలకు మెరుగైన ధర కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కనిగిరిలో ముఖ్యమంత్రి 60 పారిశ్రామిక ప్రాజెక్టులు, 51 ఎంఎస్ఎంఇలు ప్రారంభోత్సవంలో భాగంగా మొర్సిపూడిలో రూ.102 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న రమణసింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్ పనులకు మంగళవారం ముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రాన్ని వ్యవసాయకంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా దేశంలోనే ప్రథమస్థానంలో నిలిపేందుకు విజన్ కలిగిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని అన్నారు. రమణసింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్ ఏర్పాటు ద్వారా 700 మంది యువతకు ప్రత్యక్షంగా, 1500 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా మనరాష్ట్రంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులు అధికంగా ఉన్నాయన్నారు. పంటపొలాల్లో సాగుకు అడ్డులేకుండా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసి, రైతులకు మరింత ఆదాయం అందించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి విజన్ స్వర్ణాంధ్ర-2047 సాధనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షులు భాస్కరరావు, విజయ మిల్క్ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎంపిపి శిరీష తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా పారిశ్రామివేత్తకు ప్రభుత్వ ప్రోత్సాహకాల చెక్కును మంత్రి అందించారు. అనంతరం మంత్రిని రమణసింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్ యాజమాన్యం గోగినేని బాబు, గోగినేని పద్మావతి, బాలాజీ దుశ్శాలువా, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ శ్రీహరి, గృహనిర్మాణ శాఖ పీడీ సత్యనారాయణ, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ బాబ్జి, తహశీల్దార్, ఎంపిడిఒ తదితరులు పాల్గొన్నారు.

గోద్రెజ్ ఆగ్రోవేట్‌లో రూ.210 కోట్లతో రిఫైనరీ

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించిన నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని సిహెచ్.పోతేపల్లిలో గోద్రెజ్ ఆగ్రోవేట్ ప్రయివేట్ లిమిటెడ్ రూ.210 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న స్పెషాలిటీ ఫ్యాట్ ప్రాజెక్ట్, పామాయిల్ రిఫైనరీ యూనిట్‌కు సిఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సంద్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ ఇలాంటి యూనిట్లు మరికొన్ని నెలకొల్పాలని, ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా వెంటనే ప్రభుత్వం నుండి అన్ని రకాల అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. సౌకాత నియోగి సిఇఒ ఆయిల్‌పామ్ బిజినెస్ మాట్లాడుతూ యూనిట్ స్థాపనకు అవసరమైన సహాయ సహకారాలు కలెక్టర్, అధికారులు అందించారన్నారు. భవిష్యత్తులో జిల్లాలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో పెట్టుబడి పెట్టే వారికి ఎటువంటి అనుమతులు కావాలన్నా త్వరితగతిన ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎలు పత్సమట్ల ధర్మరాజు (ఉంగుటూరు), బొలిశెట్టి శ్రీనివాస్ (తాడేపల్లిగూడెం), జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, యువరాజ్, మండల అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌కెఎం ఆధ్వర్యాన 26న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రైతాంగం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్రంలోని మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) దేశవ్యాప్త పిలుపు మేరకు స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాలని రైతుసంఘాల సమన్వయ కమిటీ సమావేశం పిలుపునిచ్చింది. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో రైతుసంఘాల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం బికెఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.గౌస్, ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మున్ని, రైతుసంఘం నాయకులు తక్కెళ్లపాటి ప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా లిఖితపూర్వకంగా ఇచ్చిన ఏఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.14.65 లక్షల కోట్లు మాఫీ చేసిందని, ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు ఒక్క పైసా కూడా మాఫీ చేయలేదని చెప్పారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా నిర్వహిస్తున్నామని వివరించారు.

చదువుతోపాటు ఆటల్లోనూ ముందుండాలి

ఎంఎల్ఎ బడేటి చంటి
అట్టహాసంగా ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 6.0

ఏలూరు సిటీ: దృఢమైన దేశ సంకల్పానికి బలమైన భావిపౌరులే పునాదుల్లాంటి వారని ఎంఎల్ఎ బడేటి చంటి పేర్కొన్నారు. అందుకే పిల్లలంతా చదువుతో పాటూ ఆటలవైపు కూడా మొగ్గు చూపాలని ఆయన సూచించారు. ఏలూరులో భారతీయ క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలోని రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా సెంటర్‌లో మంగళవారం ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ 6.0 కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. క్లీన్‌నెస్, హెల్త్ అనే సమున్నత లక్ష్యాలతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకు ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం సైక్లింగ్‌ని ప్రారంభించగా తాను కూడా క్రీడాకారులతో కలిసి సైక్లింగ్ చేశారు. వారిలో స్ఫూర్తిని నింపారు. ఫ్రీడమ్ రన్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతిఒక్కరూ దృఢత్వానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. దీనిలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఫిట్ ఇండియా పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రతిఒక్కరి ఫిట్‌నెస్‌కు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అప్పుడే ఫిట్ ఇండియా లక్ష్య సాధన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిప్యూటీ డైరెక్టర్ గుర్నామ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామయ్య, డిఎస్‌డిఒ అజీజ్, అసిస్టెంట్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్‌లు వి. ఉదయ్ సందీప్, సుభంగి కరన్డే, దేవర్తి దాకన్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పిజిఆర్ఎస్‌లో సిపిఎం నేత ఫిర్యాదుతో కదిలిన అధికారులు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాల రోడ్డులో ఆక్రమణలను మంగళవారం అధికారులు తొలగించారు. మున్సిపల్ కమిషనర్ పీరయ్య ఆదేశంతో టౌన్ ప్లానింగ్ అధికారి కె.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో రైతు బజార్ వద్ద ఆక్రమణలను తొలగించారు. పిజిఆర్ఎస్‌లో సిపిఎం నేత జి.రాజు ఫిర్యాదు మేరకు ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీన నూజివీడు సబ్ కలెక్టర్‌కు సిపిఎం నేత జి.రాజు పిజిఆర్ఎస్‌లో రైతు బజారు వద్ద ట్రాఫిక్ ఎక్కువ అవుతున్న నేపథ్యంలో ఆక్రమణలు తొలగించాలని ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ఆదేశంతో అధికారులు రైతు బజారు వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా నివారణా చర్యలు చేపట్టారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల నిరసన

ఏలూరు సిటీ : ఏలూరులోని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. చిత్తూరు జిల్లా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ చిన్న ఉద్యోగి పట్ల అనుచితంగా వ్యవహరించిన తీరును వ్యతిరేకిస్తూ ఈ నిరసన చేపట్టారు. జిల్లా వాణిజ్య పన్నుల శాఖ ఉపాధ్యక్షుడు కె.చిట్టిబాబు మాట్లాడుతూ కులం పేరుతో దూషించడమే కాకుండా, ఉద్యోగిపై చేయి చేసుకోవడం అమానుషమని ఖండించారు.

పలుచోట్ల కోటి సంతకాల సేకరణ


సంతకాలు సేకరిస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకునేందుకు జరుగుతున్న కోటి సంతకాల సేకరణలో అందరూ భాగస్వామ్యం కావాల ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని గురజలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా మంగళవారం జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి గంటా సంధ్య, జిల్లా అధికార ప్రతినిధి మొట్రూ ఏసుబాబు, మండల వైస్ ఎంపిపి రాచురి రాధా, మండల అధ్యక్షులు బోయిన రామరాజు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్షు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శీలం రామకృష్ణ, గ్రామ అధ్యక్షులు మామిడిపల్లి రంగా వరప్రసాద్, రాచురి కుమార్, సాక్షి సాయిబాబు, మరీదు వసంతరావు, మీసాల రామకృష్ణ, ధగాని కోటేశ్వరరావు, పుట్టి కొండ పాల్గొన్నారు.

భీమడోలు : మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ అసంబద్ధమైనదని, దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. మండలంలోని ఆగడాలలంక గ్రామంలో మండల పరిషత్ అధ్యక్షులు కనమాల ఆదం అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. వైసిపి ప్రముఖులు ముదుండి సూర్యనారాయణ రాజు, రావిపాటి సత్య శ్రీనివాస్, ఆల్తి శ్రీనివాస్, తుమ్మగుంట రంగా, ఇతర వైసిపి శ్రేణులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ప్రజా వైద్యం ప్రజల హక్కు అని, మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని నూజివీడు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ, వైసిపి సమన్వయకర్త మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. తోటపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, వైసిపి మండల అధ్యక్షులు బి.రాంబాబు, పి.నరశింహారావు పాల్గొన్నారు.

అర్జీపై విచారణ : ఎంపిడిఒ

ముసునూరు : పిజిఆర్ఎస్ అర్జీ విషయంలో విచారణ చేపడుతున్నట్లు ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు పేర్కొన్నారు. మండలం పరిధిలోని రమణక్కపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యాన పంచాయతీ పరిధిలో చేతి పంపు బోరు సరిగ్గా పనిచేయటం లేదని, దాన్ని రిపేరు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అర్జీ అందజేయగా నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సుజాత ద్వారా చేతి పంపు బోరు పరిష్కరించినట్లు తెలియజేశారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు వ్యాయామం చేయాలి

ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి

ముసునూరు : ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజు నిత్యం వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట ప్రాథమిక ఉన్నత మండల పరిషత్ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ప్రతిరోజు వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా ఉంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు, ఐఇఆర్‌పి ఉపాధ్యాయులు డిఎంవి.లక్ష్మీనారాయణ, జె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

నూజివీడు టౌన్ : ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిరుపేద కుటుంబానికి గంటలో సుమారు రూ.4 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంత్రి కొలుసు పార్థసారథి అందజేశారు. రాష్ట్ర ప్రజల మెరుగైన వైద్యానికి చేయూత ముఖ్యమంత్రి సహాయనిధి అని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రజలకు సుమారు 5.50 కోట్ల మందికి ఎన్‌టిఆర్ వైద్యసేవలను కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలంలోని దిగవల్లి గ్రామానికి చెందిన తన్విష్ కుటుంబానికి సుమారు రూ.4 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంగళవారం అందజేశారు. ఆపదలో ఉన్న తమ కుటుంబాన్ని ఆదుకొన్నారని, ఇలాంటి మంత్రికి జీవితాంతం రుణపడి ఉంటామని బాధిత కుటుంబం ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి, తహశీల్దార్, టిడిపి అధ్యక్షులు శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన మెడికల్ క్యాంపు

ఉంగుటూరు : మానవత ఉంగుటూరు మండల శాఖ ఆధ్వర్యాన భీమవరం విష్ణు డెంటల్ కాలేజీ, రాజేశ్వరి లయన్స్ నేత్రాలయ నిడదవోలు వారిచే కైకరం, వనచర్ల ఫంక్షన్ ప్లాజాలో మెగా మెడికల్ క్యాంప్ మంగళవారం నిర్వహించారు. కంటికి సంబంధించి 134 మందికి పరీక్షలు చేయగా 22 మందిని ఉచిత కంటి ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. పంటికి సంబంధించి 120 మంది నమోదు చేయగా 85 మందికి ఉచిత చికిత్స అందించారు. మిగతా పేషెంట్లను ఆధునిక చికిత్సకు ఉంగుటూరులోని విష్ణు దంత వైద్యశాలకు రిఫర్స్ చేసారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మానవత విస్తరణ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ సాగిరాజు జానకీరామరాజు, మానవత జిల్లా కోశాధికారి, రీజియన్ ఛైర్మన్ పుప్పాల గోపి, మానవత అధ్యక్షులు కోనే వీర వెంకట సత్యనారాయణ, డాక్టర్ చైతన్య, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, గుణ్ణం బుల్లబ్బాయి పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

చింతలపూడి : శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని పలువురు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీలు సుబ్బారాయుడు గూడెంలో దాదాపుగా ఎస్‌సికి చెందిన 100 కుటుంబాలు నివసిస్తున్నారని, గ్రామంలో శ్మశాన వాటికకు భూమి లేక రోడ్డు పక్కన దహన సంస్కారాలు చేస్తున్నారని, స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అది సత్యనారాయణ, పలువురు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం

ఆగిరిపల్లి : నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని, అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలతో పాటు మెగా జాబ్ మేళాలను నిర్వహించడం జరుగుతుందని టిడిపి మండల అధ్యక్షులు ఎన్.వేణు అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 కంపెనీలకు సంబంధించిన 1194 ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించారు. ఎంపిడిఒ బి.భార్గవి, సర్పంచి సిహెచ్.లక్ష్మీ విక్టర్‌బాబు పాల్గొన్నారు.

మహిళల, చిన్నారుల భద్రత సంరక్షకులదే : ఎఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : గ్రామ, పట్టణ పరిధిలలో మహిళల, చిన్నారుల భద్రత విషయంలో మహిళ సంరక్షణ కార్యదర్శులదే ముఖ్య పాత్ర అని జిల్లా అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లావ్యాప్తంగా మహిళా రక్షణ కార్యదర్శులతో వన్డే రివ్యూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామ పరిధిలో మహిళా రక్షణ కార్యదర్శులు స్థానికంగా ఉన్న మహిళలు, బాలికలకు పోక్సో, దిశ, సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని సూచించామని తెలిపారు.

మహిళను మోసగించిన వ్యక్తికి రిమాండ్

నేరాలు - ఘోరాలు

పోలవరం : వివాహిత మహిళను మాయమాటలతో మోసగించిన కేసులో ప్రగడపల్లి గ్రామానికి చెందిన బడేటి శ్రీనివాసరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి పంపినట్లు ఎస్ఐ ఎస్.పవన్ కుమార్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే ప్రగడపల్లి గ్రామానికి చెందిన వివాహిత మహిళను మోసపూరిత మాటలతో లోబరుచుకొని మోసం చేసినట్లు బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి జంగారెడ్డిగూడెం కోర్టు ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండు విధించినట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు : మండలంలోని సూరప్పగూడెం వద్ద జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న సర్వీసు రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమడోలుకి చెందిన షేక్ సయ్యద్ బాజీ(25) అనే యువకుడు మృతిచెందాడు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భీమడోలు గ్రామం సూర్యాపేట ఆవాస ప్రాంతానికి చెందిన షేక్ సయ్యద్ బాజీ ఈనెల 4వ తేదీ రాత్రి 10 గంటలకు సూరప్పగూడెం సర్వీసు రోడ్డులో మోటారు సైకిల్ పై ప్రయాణిస్తూ రోడ్డుకు అడ్డంగా ఉన్న ధాన్యం రాశిని ఢీకొన్నారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సయ్యద్ బాజీని చికిత్స కోసం ఏలూరు లోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించటంతో మంగళవారం ఉదయం చనిపోయారు. కేసును భీమడోలు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ధాన్యం గింజనూ కొంటాం

- ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి
- 85 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- మండల వ్యవసాయాధికారి డాక్టర్ ఎన్ఎస్.ప్రవీణ్‌కుమార్

చిట్ - చాట్



ప్రజాశక్తి - ఉంగుటూరు

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిశ్చయించి గతంలో ఉండే టార్గెట్ ఆంక్షలను తొలగించినట్లు ఉంగుటూరు మండల వ్యవసాయ అధికారి డాక్టర్ ఎన్ఎస్.ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. పలు అంశాలపై ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : మండలంలో ఎన్ని ఎకరాల్లో వరి పండిస్తున్నారు? ఎంత దిగుబడి వస్తుందని అంచనా వేశారు?

ఎఒ : మండలంలో డెల్టా, మెట్ట ప్రాంతాల్లో 24,500 ఎకరాల్లో వరి పంట వేశారు. అందులో స్వర్ణం రకం 12 వేల ఎకరాలు, సంపత్ స్వర్ణ 800, పిఎల్ 2,500, ఇతర రకం 2000 వెరసి 24,500 ఎకరాల్లో 8,180 మంది రైతులు పండించారు. వాటి ద్వారా 85 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడితో రూ.200 కోట్ల పైబడి రైతులకు రావచ్చని ప్రాథమిక అంచనా వేస్తున్నాం.

ప్రశ్న : ప్రభుత్వం ధాన్యం సేకరణ ఎన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేసింది. కామన్, గ్రేడ్-1 రకాలకు ధర ఎలా ఇవ్వనున్నారు?

ఎఒ : మండలంలో 23 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ చేయనున్నారు. ఈమేరకు సంచుల(గన్ని బాగ్స్) ఇండెంట్ పొజిషన్ ప్రక్రియ చేపట్టాం. 1.12 లక్షల గోనె సంచులు అవసరం కానున్నాయి. ఈ మేరకు జిల్లా పౌరసరఫరా శాఖ అధికారుల ద్వారా సంచుల స్టాకు సిద్ధం చేసి రైతులకు అందుబాటులో ఉం చుతున్నాం. సం చుల కొరత అనేది రాకుండా యం త్రాంగం చర్య లు చేపడుతుంది. గ్రేడ్-1 రకం క్వింటాకు రూ.2,389, కామన్ వెరైటీకి రూ.2,369 ధరను ప్రభుత్వం ప్రకటించింది. ధాన్యం తోలిన కొద్ది రోజుల్లోనే నేరుగా సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాకు జమ చేయనున్నాం. గతంలో పండిన పంటలో 75 శాతం మాత్రమే కొనుగోలు చేయాలనే నిబంధనను సవరించి పండిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయనుంది. దీంతో రైతులకు గరిష్ట లాభాలు రానున్నాయి.

ప్రశ్న : ధాన్యం కొనుగోలు చేసేందుకు సిబ్బంది, యంత్ర సామగ్రి ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

ఎఒ : 23 ఆర్ఎస్‌కెలు, సచివాలయంలో మా వ్యవసాయ ఉద్యోగితో పాటు టెక్నికల్ సహాయ కుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్(డిఇఒ), హెల్పర్‌లను తాత్కాలిక పద్ధతిపై ఏజెన్సీలు, సొసైటీ నిర్వాహకులే నియమించారు. నారాయణపురం సొసైటీ ద్వారా 10 ఆర్ఎస్‌కెల్లో 30 మంది సిబ్బందిని ఎంపిక చేసుకున్నారు. అలాగే మిగతా ఏజెన్సీలు సైతం సిబ్బందిని ఏర్పాటు చేసుకున్నారు.

ప్రశ్న : నూతన యాంత్రీకరణ పరికరాలు రైతులకు ఎన్ని పంపిణీ చేశారు?

ఎఒ : గోపీనాథపట్నం, ఉంగుటూరులో ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేసేందుకు ఒక్కొక్కటి రూ.9.80 లక్షలతో రెండు డ్రోన్‌లను రైతులకు రాయితీపై ప్రభుత్వం అందజేసింది. ఇందులో రైతు వాటా రూ.2 లక్షలు కాగా మిగతా ప్రభుత్వ రాయితీ ఇచ్చింది. పవర్ ట్రిల్లర్లు 50కి పైగా రైతులకు అందించాము.

ప్రశ్న : తడి ధాన్యం ఆరబోసేందుకు టార్పాలిన్‌లు ఏర్పాటు చేశారా?

ఎఒ : ప్రతీ రైతు సేవా కేంద్రంలో టార్పాలిన్ బరకాలను ఉంచాం. కల్లాలు లేని వారు అత్యవసర సమయంలో ధాన్యం ఎండబెట్టేందుకు అందుబాటులో ఉంచాం.

ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలి

రైతాంగ సమస్యలపై 17 తీర్మానాలు
రైతు సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక


రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్‌రావు, శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు

చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు వెంటనే పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలని, మొంథా తుపాను నష్ట పరిహారాలు చెల్లించాలని, నేవీ ఆయుధ డిపో పేరుతో జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో బలవంతపు సేకరణ ఆపాలని, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 23వ మహాసభ డిమాండ్ చేసింది. మహాసభ వివరాలను జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కట్టా భాస్కర్‌రావు, కె.శ్రీనివాస్ మంగళవారం ఏలూరులో తెలియజేశారు. మహాసభలో ఆమోదించిన 17 తీర్మానాలను, నూతన జిల్లా కమిటీ వివరాలను ప్రకటించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్ల నిర్మాణం చేయాలన్నారు. కేరళ తరహాలో ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించాలని కోరారు. పాలకు గిట్టుబాటు ధర కల్పించి పాడి రైతులను ఆదుకోవాలన్నారు. రైతుల వద్ద ఉన్న లో గ్రేడ్ వర్జీనియా పొగాకు కనీస ధర కల్పించి కొనుగోలు చేయాలన్నారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారం ప్రయివేటీకరణ ఆపాలన్నారు. పలు తీర్మానాలు చేసి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నట్లు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 23వ మహాసభలో 24 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా నూతన అధ్యక్షులుగా కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శిగా కె.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులుగా సిరి బత్తుల సీతారామయ్య, కోర్స జలపాలు, జిల్లా సహాయ కార్యదర్శులుగా బొడ్డు రాంబాబు, కోన శ్రీనివాసరావు మరో 18 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. భవిష్యత్తులో జరిగే అన్ని రైతు ఉద్యమాల్లో రైతాంగం పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి ఒకేషనల్ పోటీలకు జెడ్‌పి స్కూల్ బాలికలు

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని జెడ్‌పి గర్ల్స్ హై స్కూల్ బాలికలు రాష్ట్రస్థాయి ఒకేషనల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్ఎం అనురాధ మంగళవారం అభినందనలు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ బ్యూటీ అండ్ వెల్నెస్, ఐటీ ఒకేషనల్ కోర్సులలో ట్రైయినీలు రంజిత, సల్మాలు తమ విద్యార్థులైన బాలికలకు చక్కని తర్ఫీదు ఇచ్చినట్లు తెలియజేశారు. జిల్లా స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 14న అమరావతిలో జరిగే రాష్ట్ర పోటీలకు 9, 10 చదివే బాలికలు నవ్య, కీర్తన, అలేఖ్య, అర్చన, లాస్య, ఫర్జానా ఎంపికైనట్లు చెప్పారు. విద్య పూర్తయిన తరువాత పోటీ ప్రపంచంలో ఒకేషనల్ కోర్సులు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు.

'కుటుంబానికి భరోసా ఆరోగ్య బీమా'

వేలేరుపాడు : కుటుంబానికి భరోసా ఆరోగ్య భీమా అని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఇన్సూరెన్స్ అనేది మనం ఉన్న లేకపోయినా కుటుంబానికి ఆర్థిక భరోసానిస్తుందని స్థానిక ఎస్ఐ పి.నవీన్, టిడిపి మండల అధ్యక్షులు అమరవరపు అశోక్ అన్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో ప్రీమియం చెల్లించి ఆరోగ్య కారణాల రీత్యా మరణించిన వ్యక్తికి ఇన్సూరెన్స్ చెక్కును అందజేయడానికి మంగళవారం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిడిపి మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, స్థానిక ఎస్ఐ పి.నవీన్, జనసేన మండల కార్యదర్శి మేచినేని సంజయ్, సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ఎజిఎం చిరంజీవి లైఫ్ ఇన్సూరెన్స్ గురించి వివరించారు. ఏలూరు మేనేజర్ నాగార్జున, అసిస్టెంట్ మేనేజర్ జాన్, డిఒ చింతపల్లి, ప్రకాష్, ఎస్ఒ బద్దుల పాల్గొన్నారు.

విఆర్‌ఒల బదిలీ

పోలవరం: మండలంలో పనిచేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల పనితీరుపై ప్రజల నుండి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మంగళవారం తహశీల్దారు బి.సాయిరాజు విఆర్‌ఒలను బదిలీ చేశారు. పట్టిసీమ వెంకటాపురం విఆర్‌ఒ ఎన్.బాపిరాజుని పోలవరం రెవెన్యూ 3, చేగొండపల్లి విఆర్‌ఒ బి.రమాదేవిని పట్టిసీమ, వెంకటాపురం, ప్రగడపల్లి విఆర్‌ఒ షేక్ లాల్ షరీప్ని చేగొండపల్లి, గెడ్డపల్లి ఎస్.భవానీని ప్రగడపల్లి, గెడ్డపల్లి, పోలవరం 3 విఆర్‌ఒ వై.గాంధీని పోలవరం 1, 2లకు బదిలీ చేసినట్లు తహశీల్దార్ తెలిపారు.

పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత ఆచరించాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత ఆచరించాలని అప్పుడే దోమల ద్వారా వచ్చే అంటువ్యాధులను కొంత వరకు అరికట్టుకోవచ్చు అని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మల్కాపురం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అక్కడ ప్రజలతో మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల జ్వరాలు, ఇతర అంటువ్యాధులు ప్రభలే అవకాశం ఉందన్నారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు ఎక్కువగా వృద్ధి చెంది తద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్‌గునియా మొదలగు వ్యాధులు సంభవించే అవకాశం ఉందని, దోమకాటు కంటికి కనిపించదని కానీ దాని ద్వారా ముప్పు చాలా ఉంది కాబట్టి ప్రజలు దోమల నిర్మూలనలో భాగస్వామి కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రామాంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ కిరణ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ జోషి, మేక శ్రీనివాసరావు ఆరోగ్య కార్యకర్త రేణుక, ఎంఎల్‌హెచ్‌పి పావని, ఆశాలు, రమణ, గీత కుమారి పాల్గొన్నారు.

వసతి గృహంలో మెరుగైన సౌకర్యాలు : వార్డెన్


నూతనంగా నిర్మించిన టాయిలెట్ బ్లాక్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని ప్రభుత్వ ఎస్‌సి బాలుర కళాశాల వసతి గృహంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు సౌకర్యాలు మెరుగు పరచడం జరిగిందని హాస్టల్ వార్డెన్ ఆర్‌వి.అప్పలస్వామి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో రూ.5 లక్షల వ్యయంతో వసతిగృహంలో వివిధ మరమ్మత్తులు నిర్వహించామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నిర్మించిన స్వచ్ఛ భారత మిషన్ టాయిలెట్ బ్లాక్ పనులు కూడా పూర్తయ్యాయన్నారు. వసతి గృహంలో చేరిన విద్యార్థులకు నెలకు రూ.1600 మెస్ ఛార్జీలు అందిస్తున్నామన్నారు. ట్రంకు పెట్టె, ప్లేటు, బెడ్డింగ్ మెటీరియల్ అందిస్తున్నామన్నారు. అదేవిధంగా కెరియర్ గైడ్ చేస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని వార్డెన్ అప్పలస్వామి కోరారు.

ఆదర్శంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా : సర్పంచి

భీమడోలు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశాభివృద్ధికి, సమాజాభివృద్ధికి, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఇతర బ్యాంకులకు ఆదర్శంగా నిలిచిందని పొలసానిపల్లి గ్రామపంచాయతీ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. భీమడోలు బ్యాంక్ శాఖలో మంగళవారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీనియర్ బ్యాంక్ మేనేజర్ రమేష్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ బ్యాంకు శాఖ ద్వారా అందుతున్న సేవలు, ఇతర అంశాల గురించి తెలియజేశారు. పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణపై అవగాహన

నూజివీడు టౌన్ : పట్టణంలోని బాలుర వసతి గృహంలో ప్రపంచ మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సిఐ సత్య శ్రీనివాస్ విద్యార్థులతో మాట్లాడుతూ మత్తు పదార్థాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే నష్టాలను వివరించారు.

లోపూడిలో 'పొలం పిలుస్తుంది'

ముసునూరు : ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసే ఎ గ్రేడ్ ధాన్యం ధర రూ. 2,389 అధిక ధర లభిస్తుందని మండల వ్యవసాయ అధికారిణి ఎ.చాముండేశ్వరి పేర్కొన్నారు. మండలం పరిధిలోని లోపూడి, రమణక్కపేట గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి వరి పంట ఎక్కువ శాతం కోత దశలో ఉండటంతో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

24 గంటల్లోనే రైతు ఖాతాకు నగదు జమ : మంత్రి


ఉంగుటూరులో ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ


ముదినేపల్లిలో ప్రారంభిస్తున్న నరసింహారావు

జీలుగుమిల్లి : రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు తెలిపారు. మంగళవారం జీలుగుమిల్లి సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రైతులెవ్వరూ దళారాలను ఆశ్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచి చిర్రి జగదాంబ, జనసేన అధ్యక్షులు పి. రాము, సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ రాజు, కూటమి నాయకులు జి. రవి కుమార్, సాంబ, వ్యవసాయ శాఖాధికారి గంగాధర్, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : ఉంగుటూరు రైతు సేవ కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఉషారాణి మంగళవారం రాత్రి ప్రారంభించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు 48 గంటల్లో వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందన్నారు. సర్పంచి బండారు సింధు, తహశీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్, భీమడోలు ఎడిఎ పి.ఉషా రాజకుమారి, బొమ్మిడి సొసైటీ ఛైర్మన్ మైలవరపు గోపాలకృష్ణ, జనసేన నాయకులు సూరతుల అయ్యప్ప, మంద శ్రీనివాసరావు, ఉప సర్పంచి జగదీష్, ఎఒ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని వడాలిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం టిడిపి నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని, అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మాయిశ్చర్ మీటర్లు, సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. వరి కోతలు జరిగిన రైతులు తమ సరుకును ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి అమ్ముకోవచ్చని తెలిపారు. మండల వ్యవసాయాధికారి బి. వేణుమాధవ్ మాట్లాడుతూ మండలంలో సుమారు 14,500 ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రావచ్చని ఆశిస్తున్నామన్నారు. కోతలు కోసిన రైతులు తమ ధాన్యాన్ని కల్లాలపై బాగా ఆరబెట్టుకుని సరుకును కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తెలిపారు. తేమ శాతం గరిష్టంగా 17 వరకు ఉండవచ్చని, బాగా ఆరుదల అయ్యే వరకు ధాన్యాన్ని కల్లాల్లో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ముదినేపల్లి : పేకాడుతున్న ఇరువురి వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముదినేపల్లి శివారు అన్నవరం జగనన్న కాలనీలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంపై ఎస్ఐ వివిఎస్.వీరభద్రరావు తన సిబ్బందితో దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.2,800 నగదు, 52 పేక ముక్కలు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముసునూరు : పోలీస్ స్టేషన్ పరిధిలోని బలివే గ్రామంలో పేకాట శిబిరంపై ఎస్ఐ ఎం.చిరంజీవి వారి సిబ్బందితో కలిసి దాడులు చేసి 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారి వద్ద నుండి రూ.13,500 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

18 నుంచి యాక్ట్ 30 అమలు : ఎస్‌పి

ఏలూరు స్పోర్ట్స్ : ఈనెల 18వ తేదీ నుండి డిసెంబర్ 12వ తేదీ వరకు యాక్ట్ 30 అమల్లో ఉందని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పత్రికా ప్రకటన ద్వారా మంగళవారం రాత్రి తెలియజేశారు. ఈ యాక్సిడెంట్ 30 ప్రకారం పబ్లిక్ మీటింగులు, ప్రదర్శనలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలంటే కచ్చితంగా స్థానిక పోలీసుల అనుమతి పొందాలని, ఏదైనా ఒక ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందనే సమాచారం పోలీసులకు ముందస్తుగా తెలిస్తే వెంటనే ఆ సమావేశాలు రద్దుచేసే అవకాశం పోలీసులకు ఉంటుందని, కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

స్పిల్ వే పరిశీలన

పోలవరం : పోలవరం ప్రాజెక్టుని మహారాష్ట్ర జలవనరులశాఖ అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. ఈ బృందం తొలుత స్పిల్వే, డయాఫ్రంవాల్, ఎగువ దిగువ కాపర్ డ్యాంలను, స్పిల్వేలో ఫిష్ ల్యాడర్, పవర్ హౌస్ ప్రాంతాలను పరిశీలించింది. ఈ బృందానికి ప్రాజెక్టు డిఇ బాలకృష్ణ, మెగా మేనేజర్ ఎ.గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళీ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్న పనుల తీరును వివరించారు.